


చేయి పట్టుకు నడవాలని చెల్లితో తమ్ముళ్ళతో సంతోషంగా గడపాలన్న కోరిక కోరికలాగా మిగిలిపోయింది.

ఓరోజు తరగతిలో రేపు పేరెంట్స్ డే ఉంది. మీ తల్లిదండ్రులను తీసుకురావాలి అని టీచర్ చెప్పారు. ఆ ఆహ్వానపత్రం మీద సంతకం చేసి తెమ్మన్నారు. తను అమ్మమ్మ తాతయ్య వస్తారని చెప్పినప్పుడు ''పాపం నీకు అమ్మా... నాన్న...'' అంటూ టీచర్ ఆపేసింది. హృద్యకు అపశకునంలా అనిపించి కళ్ళలో నీళ్ళు తిరిగి... ''వాళ్ళు వేరే ఊర్లో ఉంటారు. నాకు చిన్నతమ్ముడు, చెల్లి కూడా ఉన్నారు. నేనేమో అమ్మమ్మ తాతయ్యల దగ్గర ఉండి చదువుకుంటున్నాను.'' టీచర్‌కి అర్ధమయ్యేలా చెప్పింది.

''సారీ హృద్య!'' అని టీచర్ అన్నా, ఆ తరువాత హృద్య ఆలోచనలు చాలా దూరం వెళ్ళాయి. ఆ రాత్రి అమ్మమ్మ దగ్గర కూర్చుని పంతం పట్టి మరీ అడిగింది. ''ఎందుకమ్మా! నన్ను అమ్మా నాన్నలు ఇక్కడ ఉంచారు?'' అని.

''ఏం లేదమ్మా! నీకు ఏడాది నిండుతుండగా అమ్మకు తమ్ముడు పుట్టాడు. ఆ ఏడాదికి చెల్లి కడుపున పడింది. అందరినీ సంభాలించలేక మీ అమ్మ ఇబ్బంది పడుతుంటే నేనే తీసుకు వచ్చాను.''

''అబద్ధం అమ్మమ్మా, అదే నిజమైతే ఇప్పుడు తమ్ముడు చెల్లి పెద్దవాళ్ళయి బడికి వెళ్తున్నా, నన్నెందుకు మళ్ళీ తీసుకెళ్ళలేదు. అమ్మకి నేనంటే ఇష్టమే. మరి నాన్నెందుకు నన్ను చూసి ముఖం తిప్పుకుంటాడు. తెలియక నేనేదైనా తప్పుచేశానా అమ్మమ్మా''.

''లేదు తల్లీ నిన్ను దూరం చేసుకొని మీ నాన్నే తప్పుచేస్తున్నాడు.'' గొణుక్కుంటూ లోనికి వెళ్ళిపోయింది. హృద్య మనసులో సందేహాలు, సందేహాలుగానే మిగిలి పోయాయి.

కొంతకాలం తరువాత ఎవరినీ తరచి తరచి అడగక్కర లేకుండానే తన ఏడవ తరగతి వేసవి సెలవుల్లో పట్టుబట్టి అమ్మ దగ్గరకు వెళ్ళినప్పుడు చాలా విషయాలు అర్ధమయ్యాయి.

''అమ్మా.... నేనింక ఇక్కడే ఉండి చదువుకుంటానమ్మా, అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళను'' అమ్మ దగ్గర హృద్య మారం చేసింది.

''వద్దు తల్లీ! మీ నాన్న ఓ రాక్షసుడు... ఊరు

